# యూనివర్సిటీ కథలు

## గాయం

రాగిణి తలదించుకుని కూర్చుంది.

ఎంత చదువుకున్నా పెళ్ళి చూపులనగానే బిడియం వచ్చేసింది.

'కానీయమ్మా...అబ్బాయిని చూడు. చదువుకున్న పిల్లవి నీకే ఇంత సిగ్గయితే ఎలా? మీరిద్దరూ ఊ.. అంటే మిగతా కార్యక్రమాలన్నీ నిమిషాల మీద జరిగిపోతాయి. మధ్యవర్తిగా వచ్చిన నారాయణరావు తొందర పెడుతున్నాడు. పక్కనకూర్చున్న పెద్దక్క ప్రేమగా తల నిమిరింది—'అబ్బాయిని చూడవే అన్నట్లు'

తలమాత్రం ఎత్తకుండా ముడుచుకు కూర్చుంది. అతని షూస్ కనిపిస్తున్నాయి. అప్పుడు...కొద్దిగా తల పైకెత్తి అతని వైపు తొలిసారిగా చూసింది. సరిగ్గా అప్పుడే అతను రాగిణి వైపు చూశాడు. అతను ఆనంద్ కళ్ళల్లో తీక్షణత....రాగిణి నిర్ఘాంతపోయింది.

::: ::: :::: ::::: ::::: :::: :::: :::: :::: :::: ::

విశాఖపట్నం...

ఆంధ్రా యూనివర్సిటీ మహారాణిపేట లేడీస్ హాస్టల్. ఆరు గంటలు కావస్తోంది. అప్పటివరకూ దినసంచారంలో డస్సిపోయిన దినకరుడు పశ్చిమాద్రి వైపు జారుకుంటున్నాడు. సుమబాలలను అన్వేషించే తుమ్మెదల్లా ఇద్దరు, ముగ్గురు చొప్పున పురుష పుంగవులు యూనివర్సిటీ కాంపస్ నుంచి కాళ్ళీడ్చుకుంటూనో, బస్సుల్లోనో కొండొకచో ఫ్రెండ్ని అల్పాపురికి తీసుకెళ్తానని వాగ్దానం చేసి పుచ్చుకున్న స్కూటర్ పైనో లేడీస్ హాస్టల్ దగ్గరకు చేరుకుంటున్నారు.

హాస్టల్ ఫస్ట్ ఫ్లోర్లోని చివరి రూమ్లో జడ వేసుకుంటున్న రాగిణి ఆ సమయానికి అలవాటుగా గేటుకి ఎదురుగా వున్న చెట్టు వైపు చూసింది.

సరిగ్గా—ఆమె ఊహించినట్లుగానే అక్కడ ఆనంద్ నిలబడి వున్నాడు. ఓ క్షణం రాగిణి గర్వంగా ఫీలైంది. తన క్లాస్మేట్ ఆనంద్ తనంటే పడిచస్తాడని ఈ మధ్య చాలాసార్లు గమనించింది. డిపార్ట్మెంట్లో తన వైపు దొంగ చూపులు చూస్తూ లైబ్రరీకెళుతూ వుంటే తనకు తెలియకుండా అనుసరించాలని ప్రయత్నిస్తూ చాలాసార్లు దొరికిపోయాడు. కొద్దిరోజుల నుంచి సాయంత్రంపూట సరిగ్గా ఇదే సమయానికి హాస్టల్ ముందు ఆ చెట్టుకింద నిరీక్షిస్తూ తన రూమ్ వైపు చూస్తూవుండడం గమనించి 'అబ్బాయికి పైత్యం మరికాస్త ముదిరింది' అనుకుని సన్నగా నవ్వుకుంది. అప్పుడే లోపలకు వచ్చిన రూమ్మేట్ వేద....

'ఏమిటే బయటకు చూస్తూ నీలో నువ్వే నవ్వుకుంటున్నావు' అంది. రాగిణి సమాధానం కోసం



చూడకుండా కిటికీ దగ్గరకు వచ్చి 'అటు చూడవే.. ఆ మున్సిపాల్టీ లాంప్ దగ్గర చేతిలో సిగరెట్‌తో రాజ్‌దూత్ మీద కూర్చున్న లేడు—వాడు అప్లయిడ్ ఫిజిక్స్ చేస్తున్న నిశాంతి కోసం వస్తాడు. ఇటుపక్క కిళ్లీషాప్ పక్కనే లాల్చీ పైజమా వేసుకునిలేడు వాడు తెలుగు డిపార్ట్‌మెంట్ సీత కోసం వస్తాడు. ఆ ఫుల్‌షర్ట్ వేసుకుని పైలాపచ్చీస్‌గా లేడు వాడు ఎడ్యుకేషన్ చేస్తున్న నీరజ అంటే ప్రాణం విడుస్తాడు.

గంగలా చెప్పేసింది వేద...

రాగిణి కిటికీ దగ్గరగా జరిగి వేద భుజంపై చేయి వేసి...

'ఇటు తిన్నగా చూడు చెట్టు కింద వైట్ షర్ట్, బ్లాక్ ఫ్యాంట్ టక్ వేసుకుని నిలబడి లేడు అతను నా కోసమే పడిగాపులు' చెప్పింది.

'రియల్లీ... వాటే సర్‌ప్రైజింగ్. అయితే నీ కోసమూ ఓ ప్రాణి అహర్నిశలు జపిస్తున్నాడన్నమాట' కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అంది వేద. ఆ క్షణంలో తన స్టేటస్ హిమగిరి శిఖరాన్ని అందుకున్నట్టు ఫీలైంది రాగిణి.

రెండు నిమిషాలు ఆగి వేద 'అయితే అతడు నీ కోసమే వచ్చాడని మేమెలా నమ్మేది' అంది.

వేద సందేహానికి రాగిణి సమాధానం చెప్పకుండా 'ఒన్ మినిట్ నువ్విలా కిటికీ పక్కకు రా' అని తాను కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది. ఇప్పుడు చెట్టు కింద వున్న ఆనంద్‌కు రాగిణి ఒక్కతే కనిపిస్తోంది. వేదకు మాత్రం ఇద్దరూ స్పష్టంగా కనిపిస్తున్నారు. రాగిణి చేతులెత్తి ఆనంద్‌వైపు 'హాయ్' అన్నట్లు ఊపింది. వెంటనే అతను చెయ్యి ఊపాడు. అతని మొహంలో వెయ్యి విద్యుద్దీపాల కాంతి. రేపు రమ్మనమన్నట్లు సైగ చేసింది. అతను సైగ చేసి వెళ్ళిపోయాడు.

'ఓకే...యూ ఆర్ రైట్, నేను ఒప్పుకున్నాను. అతను వచ్చేది నీ కోసమే' చెప్పింది వేద.

మరుసటిరోజు ఆరు గంటలకు రాగిణి కంటే ముందుచూసి చెప్పింది వేద—'రాగీ,నీ ప్రాణనాథుడు వచ్చాడే'

'వచ్చాడా..ఈ రోజొక ట్రిక్ చేస్తా చూడు..జస్ట్ ఫర్ ఫన్' అంటూ కిందకు వెళ్ళి వాచ్‌మెన్‌ను పిలుచుకువచ్చింది.

'నరసింహులు..ఆ చెట్టు కింద నిల్చుని వున్నారే అతన్ని ఓసారి పిలుచుకురా' అంది.

'అలా జెంట్స్‌ని లోపలకు రానీయకూడదమ్మాయి గోరూ, మీకు తెలియనిది ఏముంది?' నరసింహులు గుంభనగా నవ్వాడు. దానర్థం రాగిణికి తెలుసు. వెంటనే వాడి చేతిలో పది రూపాయల నోటు పెట్టింది. నోటు చేతిలో పడగానే వాడు శరవేగంతో పరిగెత్తాడు. చెట్టు కింద నిల్చున్న ఆనంద్‌తో ఏదో చెబుతూ వుండడం కిటికీలో నుంచి రాగిణి, వేద చూశారు. ఆనంద్‌కి ఈ పిలుపు సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. అతను రాగిణితో తన మనసులో మాట చెప్పేందుకు చాలాకాలం నుంచి ఎదురుచూస్తున్నాడు. అందుకే ఆనందంతో లోపలకు నడిచాడు. ఫస్ట్ ఫ్లోర్‌లో అన్ని రూమ్‌లు దాటుకుంటూ కార్నర్‌లో వున్న రాగిణి రూమ్ దగ్గర ఆగాడు. రూమ్ తలుపు వేసివుంది.

తలుపు మీద శబ్దం చేశాడు. రాగిణి తలుపు తీసింది. ఆనంద్ వైపు ప్రశ్నార్థకంగా చూసింది. అతను కొంచెం తడబడ్డాడు.

'ఎస్ మిస్టర్...మీకెవరు కావాలి? తలుపెందుకు కొట్టారు?' రాగిణి మాట దాదాపు అరుపులా వుంది. ఆనంద్ నిశ్చేష్టుడయ్యాడు. వాచ్‌మెన్ రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చాడు.

'లేదు..వాడు ఐదుకి పదికి కక్కుర్తిపడతాడే తప్ప అబద్ధాలు చెప్పడు' అంది.

'అసలు మీరు లేడీస్ హాస్టల్‌లోకి ఎలా ఎంటర్ కాగలిగారు. వాచ్‌మెన్‌ను మచ్చికచేసుకుని వచ్చారా? ఎవరు కావాలి?' ఆడ పులిలా గర్జిస్తోంది రాగిణి. ఈ లోపున చుట్టుపక్కల రూమ్స్‌వాళ్ళంతా అక్కడ చేరారు. వేదకి ఇదంతా ఆశ్చర్యంగా వుంది.

అదే సమయానికి రౌండ్స్‌కు వచ్చిన మేట్రిన్ ఏదో గలభా జరుగుతోందని దగ్గరకొచ్చింది.

'మేడమ్, వాడిని చూడండి,. ఎలా ఎంటర్ అయ్యాడో హాస్టల్‌లోకి వచ్చాడు. మా రూమ్ తలుపు తడుతున్నాడు. అసలు పర్మిషన్ ఎలా వచ్చింది?' మేట్రిన్‌ని సూటిగా అడిగింది రాగిణి.

మేట్రిన్ తన స్థూలకాయాన్ని కదిలిస్తూ వెంటనే రియాక్ట్ అయ్యింది.

'టెల్ మీ మిస్టర్...హూ ఆర్ యూ..గెటౌట్ ఫ్రమ్ హియర్ ఇమీడియట్లీ' పూనకం వచ్చినట్లు అరిచింది మేట్రిన్.

డిపార్ట్‌మెంట్‌లో ఫస్ట్ రాంక్‌లో వుండి మంచి కుటుంబం నుంచి వచ్చిన ఆనంద్ అప్పటికే సిగ్గుతో జీవచ్ఛవమయ్యాడు. దోషిలా తలదించుకుని పెదవి విప్పకుండా కదిలివెళ్ళిపోయాడు.

అందరూ వెళ్ళి—హడావుడి తగ్గగానే తలుపులు వేసి రాగిణి పడిపడి నవ్వింది.

'వాటే ఫన్నీ ప్రాక్టికల్ జోక్' నవ్వు తెరల మధ్య అంది. వేద రెండు నిమిషాలు మౌనంగా వుంది. ఆ తర్వాత—

'రాగీ, నువ్వు చేసింది చాలా తప్పే. నువ్వు ఇంత పనిచేస్తావని తెలిస్తే అడ్డుపెట్టేదాన్ని. ఆనంద్‌ని రానిచ్చే దాన్నికాదు. అతను ఏన్నేం చేశాడు? ఒక్క క్షణం ఆలోచించు. నీ వెంట పడ్డాడా? నిన్ను టీజ్ చేశాడా? అదేం లేదే...పవిత్రమైన మనస్సుతో నిన్ను ఆరాధించాడు. అందుకు నువ్వు అతనికి అంత పెద్ద శిక్ష వేస్తావా?' వేద మాటలు విన్న తర్వాత ఆలోచనలో పడింది రాగిణి.

ఆలోచించేకొద్దీ తాను చేసింది ఎంత ఘోరమైన తప్పో అర్థమైంది. మర్నాడు డిపార్ట్‌మెంట్‌లో ఆనంద్‌ని క్షమాపణ అడగాలని నిశ్చయించుకుంది. అయినా ఆ రాత్రి నిద్రపట్టక అశాంతిగా గడిపింది. మర్నాడు ఆనంద్ కనబడలేదు. ఆ మర్నాడే కాదు అతను మరెప్పుడూ కాంపస్‌లో కనబడలేదు. చదువుమానేసాడన్నారు కొందరు. మరో యూనివర్శిటీలో చేరాడనుకున్నారు మరికొందరు.

:::::: :::::: :::::: :::::: :::::: :::::: :::::: :::::: ::::::

'ఏమ్మా...అమ్మాయి, అబ్బాయి ఒకరినొకరు ఇష్టపడితే మాకేం అభ్యంతరం లేదంటున్నారు మీ పెద్దలు. మీ ఉభయులూ ఓకే అనండమ్మా' మధ్యవర్తి తొందరపెట్టడంతో వర్తమానంలోకి వచ్చింది రాగిణి.

'ఒకరికొకరు నచ్చకపోవడమేమిటి? ఇద్దరూ అందమైనవాళ్ళే. అమ్మాయి ఒక్కత్తే..ఆస్తంతా ఆమెదే. అబ్బాయి మంచి పొజిషన్‌లో వున్నాడు. శుభస్య శీఘ్రం' అన్నది ఓ ముత్తయిదువ.

అప్పటికే పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న రాగిణి సిగ్గుతో కనులువాల్చి 'నాకు ఇష్టమే నాన్నా' అంది.

అప్పుడు లేచి నిలబడ్డాడు ఆనంద్—'నాన్నా, వాళ్ళను మరో సంబంధం చూసుకోమని చెప్పు' అంటూ బయటకు నడిచాడు.

—సురేష్

